వృద్ధులకు ఇంటి వద్దకే ఓటింగ్

సిర్గాపూర్: బీఎల్‌వోలకు సూచనలిస్తున్న ఆర్డీవో అశోకచక్రవర్తి

సిర్గాపూర్, ఏప్రిల్ 19: ఎన్నికల్లో 85 ఏండ్లు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దకే బ్యాలెట్ తీసుకెళ్లి ఓటింగ్ నిర్వహిస్తామని నారాయణ ఖేడ్ ఆర్డీవో అశోకచక్రవర్తి అన్నారు. శుక్రవారం సిర్గాపూర్‌లోని రైతువేదికలో బీఎల్‌వోలకు ప్రత్యేక అవగాహన కల్పించారు. మండలంలో 85 ఏండ్లు పైబడిన వృద్ధులు, పూర్తి అంగవైకల్యంతో ఉన్న దివ్యాంగులను గుర్తించి నివేదిక పంపాలన్నారు. ఎన్నికలు పకడ్బందీగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం స్థానిక తహసీల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమాశంకర్, ఎంపీడీవో మన్సూర్‌నాయక్, బీఎల్‌వోలు ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు లాభాలు

కాశీంపూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారి సోమేశ్వర్‌రావు

కోహీర్, ఏప్రిల్19: ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు మేలు కలుగుతుందని ఉద్యానశాఖ జిల్లా అధికారి సోమేశ్వర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం జహీరాబాద్ మండలంలోని కాశీంపూర్‌లో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సోమేశ్వర్‌రావు మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు కోసం ప్రభుత్వం సబ్సిడీ అందిస్తున్నదని, ఒక్కో మొక్క రూ.20కే అందిస్తున్నామన్నారు. నర్సరీల్లో మొక్కను రూ.200 తీసుకుంటారని చెప్పారు. ఒక ఎకరం సాగు చేస్తే రూ.లక్ష వరకు ఆదాయం లభిస్తుందన్నారు. అన్ని నెలల్లో ఆయిల్‌పామ్ పంట సాగు అవుతుందని, రైతులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమం లో వ్యవసాయధికారులు, రైతులు పాల్గొన్నారు.

చీక్‌మద్దూర్‌లో ఎన్ఎస్ఎస్ శిబిరం

చీక్‌మద్దూర్‌లో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో మాట్లాడుతున్న అధికారులు

హత్నూర, ఏప్రిల్ 19: మండలంలోని చీక్‌మద్దూర్ గ్రామంలో శుక్రవారం జాతీయ సేవాపథకం ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో కందిలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 45మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఆఫైర్స్ తెలుగు రాష్ట్రాల రీజినల్ డైరెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ గ్రామంలోని వ్యవసాయ పద్ధతులు, ఆరోగ్య సమస్యలు, స్వచ్ఛభారత్ తదితర కార్యక్రమాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. శిబిరం ఏడురోజులపాటు కొనసాగుతుందని, విద్యార్థులు ప్రజల్లోకెళ్లి ప్రజల జీవనవిధానం, ఆర్థిక స్థితిగతులపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సీసీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొ.జెల్ల సత్యనారాయణ, మోటివేషన్ స్పీకర్ నరేందర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్, ప్రొ.సయ్యద్‌హుస్సేన్, ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పద్మ, రాకేశ్ పాల్గొన్నారు.

పరిశ్రమలో పీసీబీ అధికారుల తనిఖీ

పరిశ్రమలో తనిఖీలు చేస్తున్న పీసీబీ అధికారి

బొల్లారం, ఏప్రిల్ 19: 'యథేచ్ఛగా రసాయన వ్యర్థజలాల విడుదల' శీర్షికన నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి పీసీబీ అధికారులు స్పందించారు. శుక్రవారం బొల్లారం పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో పీసీబీ అధికారి గౌతమి తనిఖీలు నిర్వహించారు. పరిశ్రమ లోపల బయట పరిశీలించారు. రసాయన వ్యర్థాలను ఆసానికుంట ప్రధాన కాల్వతోపాటు బహిరంగ ప్రదేశాల్లోకి విడుదల చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘాటైన వాసనలతో వాతావరణాన్ని కలుషితం చేస్తున్న పరిశ్రమపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారి స్పష్టం చేశారు. అదేవిధంగా ప్లాస్టిక్ వ్యర్థాలను విచ్చలవిడిగా వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓఆర్ఆర్‌పై కారు, లారీ ఢీ

ఇద్దరు మృతి, నలుగురికి తీవ్రగాయాలు

కొల్లూరు వద్ద రోడ్డు ప్రమాదాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పటాన్‌చెరు, ఏప్రిల్ 19: ఔటర్ రింగ్‌రోడ్డుపై కొల్లూరు వద్ద లారీని వెనుక నుంచి ఇన్నోవా కారు ఢీకొట్టడంతో కారులోని ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. బీడీఎల్ పోలీసుల కథనం ప్రకారం..చంద్రాయన్‌గుట్టకు చెందిన ఓ కుటుంబం గుల్బర్గాకు వెళ్లి తిరిగి వస్తున్నారు. కొల్లూరు ఎగ్జిట్ వద్ద ముందున్న లారీని కారు డ్రైవర్ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న మహమ్మద్ మునవర్, అనీస్ ఫాతిమా అక్కడికక్కడే మృతి చెందారు. ఎండీ జాఫర్, సర్వర్, ఎస్‌డీ షఫీ, గులాబ్‌షాకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం విషయం తెలుసుకున్న బీడీఎల్ సీఐ రవీందర్‌రెడ్డి సిబ్బందితో వెళ్లి క్షతగాత్రులను నగరంలోని దవాఖానలకు తరలించారు. మృతదేహాలను పటాన్‌చెరు ఏరియా దవాఖానకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వెంకట్రామిరెడ్డిని గెలిపించాలి

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- పట్టణంలో బీఆర్ఎస్ నాయకులను కలిసిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి
- స్థానికుడికి మద్దతు ఇవ్వాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపు

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో కలిసిన బీఆర్ఎస్ నాయకులను కలిసిన ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

పటాన్‌చెరు, ఏప్రిల్ 19: కలెక్టర్‌గా, జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన విశేష అనుభవం ఉన్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి గెలిపించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి పటాన్‌చెరులో పర్యటించారు. మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ మాదిరి జైపాల్, సీనియర్ నాయకులు సఫాన్‌దేవ్, శంకర్ యాదవ్, ప్రతాప్‌సేట్, పృథ్వీరాజ్ తదితరులను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలనా రంగంలో ఎంతో అనుభవం ఉన్న వెంకట్రామిరెడ్డి ఎంపీగా గెలిస్తే అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయన్నారు. రూ.100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి యువతీ,యువకులకు కోచింగ్ కేంద్రాలు, వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి జాబ్‌మేళా ద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ముందుకు రావడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, 6 గ్యారెంటీలు అటకెక్కాయన్నారు. బీజేపీ తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. మాయ మాటలు చెప్పేవారిని నమ్మవద్దని, పనిమంతుడైన వెంకట్రామిరెడ్డికి మద్దతు తెలపాలన్నారు. లోకల్ నివాసి, తెల్లాపూర్‌కు చెందిన వెంకట్రామిరెడ్డికి ఎన్నికల్లో భారీ మెజార్టీ అందించాలని ఎమ్మెల్యే కోరారు. పటాన్‌చెరు ప్రాంతంలో ఉన్న సమస్యలపై, వాటి పరిష్కారంపై సంపూర్ణ అవగాహన ఉందని వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రాంత సమస్యలపై పార్లమెంటులో గళమెత్తుతానన్నారు. ఈ ప్రాంత వాసిగా, ప్రజా సేవ కోసం వస్తున్న తనను ఆశీర్వదించాలని కోరారు. వారి వెంట సీనియర్ నాయకుడు గూడెం మధుసూదన్ రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు అప్జల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కంగ్టి, ఏప్రిల్ 19: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన కంగ్టి శివారులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. కంగ్టి ఎస్ఐ విశ్వజన్ కథనం ప్రకారం దెగుల్‌వాడి గ్రామానికి చెందిన మచ్చారి బాలాజీ(45) కంగ్టి నుంచి దెగుల్‌వాడి వైపు బైక్‌పై వెళ్తున్న క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో బాలాజీ అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుంతల రోడ్లతో అవస్థలు

బొల్లారం, ఏప్రిల్ 19: గుంతల రోడ్లతో అవస్థలు పడుతున్నామని సంఘ సేవకుడు ఆనంద్‌కృష్ణారెడ్డి అన్నారు. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో మిషన్ భగీరథ పైప్‌లైన్ నిర్మాణం కోసం తవ్విన గుంతలు సరిగా పూడ్చడం లేదన్నారు. కార్మికులు రోడ్లపై ప్రయాణిస్తూ గాయాల పాలవుతున్నారని ఆనంద్‌కృష్ణారెడ్డి శుక్రవారం అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రమాదవశాత్తు గుంతల రోడ్లపై ప్రయాణించి ఓ కార్మికుడు కాలు విరిగిన విషయాన్ని తెలుసుకొని పరామర్శించారు. వెంటనే కమిషనర్ స్పందించి గుంతల రోడ్లను బాగుచేసే విధంగా చర్యలు తీసుకొని ప్రజల ఇబ్బందులను తొలిగించాలని విజ్ఞప్తి చేశారు.

పేదింటి ఆడబిడ్డకు సాయం

కంగ్టి, ఏప్రిల్ 19: పేదింటి ఆడబిడ్డ పెండ్లికి పిపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కంగ్టి గ్రామానికి చెందిన దర్జీ మహేశ్వరికి శుక్రవారం రూ.5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ మహేశ్వరి తండ్రి గతంలో మృతి చెందాడని, వారి స్థితిని చూసి ట్రస్ట్ తరపున ఆర్థికసా యం చేసినట్లు సభ్యుడు చంద్రకాంత్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో అశోక్, గణేశ్‌గౌడ్, విజయ్ తదితరులు ఉన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 19 : న్యాయసేవాధికార సంస్థ, వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట కోర్టు భవనంలో సీపీఆర్ విధానంపై సిబ్బంది, న్యాయవాదులకు శుక్రవారం రాత్రి జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురామ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీపీఆర్ చేసే విధానాన్ని వైద్యులు వినోద్, బాబ్జి, శ్రీకాంత్ యాదవ్ చూపించారు. కార్యక్రమంలో జడ్జిలు మురళీమోహన్, స్వాతిరెడ్డి, మిలింద్ కాంబ్లే, శ్రావణి యాదవ్, కోర్టు సిబ్బంది పద్మ, యోగేశ్వర్, అనుష తదితరులు ఉన్నారు.

ర్యాలీలో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి క్రాంతి

ఫ్లకార్డు ప్రదర్శిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి క్రాంతి

ఓటుహక్కును వినియోగించుకుందాం

జెండాఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 19: జిల్లాలోని ప్రతిఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని ఐబీ వద్ద జెండాఊపి స్వీప్ అవగాహన ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. ఐ వోట్ ఫర్ షూర్ ఫ్లకార్డ్‌ను కలెక్టర్ ప్రదర్శించారు. కలెక్టర్ ఎడ్ల బండిపై ఎక్కి ఫ్లకార్డు ప్రదర్శిస్తూ అందరినీ ఉత్సాహపర్చారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ స్వీప్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించామని చెప్పారు.ఓటుహక్కు ముఖ్యమైనదని ఆయన స్పష్టం చేశారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు. ర్యాలీలో ఎన్నికల అధికారులు, వివిధ శాఖల అధికారులు, యువత తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన ఎడ్ల బండి ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ క్రాంతి

పండుగ వాతావరణంలో ఎన్నికలు జరగాలి

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు మోతీలాల్ ఎస్ షీలే

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 19: జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు మోతీలాల్ ఎస్ షీలే ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాలులో జిల్లా అదనపు కలెక్టర్ మాధురి, నోడల్ అధికారులు బాలశౌరి, అంజయ్యలతో కలిసి జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల అకౌంటింగ్ టీం, వీడియో రికార్డింగ్, వీడియో సర్వేలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ వచ్చేనెల 13వ తేదీన జరగనున్న జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని అధికారులకు సూచించారు. ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వర్తించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఈవోలు రోజువారీ నివేదికలను అందించాలన్నారు. అభ్యర్థులు ఏవైనా క్రిమినల్ కేసులు ఉంటే వాటి వివరాలను పేపర్ ప్రకటనలు, టీవీ ప్రకటనలు తేదీ కన్నా ముందు మూడుసార్లు ప్రచురించాలన్నారు. అభ్యర్థులు వారి ఖర్చుల వివరాలు ఏ, బీ, సీ రిజిస్టర్‌లో ప్రతిరోజూ నమోదు చేయాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయ పరిమితి రూ.95 లక్షలకు మించరాదన్నారు. అభ్యర్థులు వారి ప్రత్యేక బ్యాంకు ఖాతా నుంచి మాత్రమే ఖర్చు చేయాలని సూచించారు. ఓటర్లను ప్రభావం చేసే డబ్బుల పంపిణీ, మద్యం పంపిణీపై నిఘా ఏర్పాటు చేసి ఓటర్లను అభ్యర్థుల ప్రలోభాలకు గురికాకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత ఆయా బృందాలకు ఉన్నదన్నారు.

న్యాల్‌కల్: హుసేల్లి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద వాహన రాకపోకలను పరిశీలిస్తున్న జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకుడు మోతీలాల్ ఎస్ షీలే

అప్రమత్తంగా ఉండాలి

న్యాల్‌కల్, ఏప్రిల్ 19: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి, తెలంగాణలోకి వచ్చే వాహనాలను పకడ్బందీగా తనిఖీ చేయాలని జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు మోతీలాల్ ఎస్ అన్నారు. శుక్రవారం మొగుడంపల్లి మండలం మాడ్గి, న్యాల్‌కల్ మండలంలో హుస్సేల్లి గ్రామాల శివారులోని తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని ముంబయి-హైదరాబాద్, బీదర్-జహీరాబాద్ ప్రధాన రోడ్డు మార్గాల్లో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. వాహనాల రాకపోకల నమోదు, స్వాధీనం చేసుకున్న నగదు, మద్యం తదితర రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట జహీరాబాద్ ఆర్డీవో రాజు, డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి, మండల తహసీల్దార్ రాజిరెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సతీశ్, జహీరాబాద్ పట్టణ సీఐ రవి, హుద్నూర్ ఎస్ఐ రామానాయుడు, ఆర్ఐ దుర్గయ్య ఉన్నారు.

మిషన్ భగీరథ పనుల పరిశీలన

రాయికోడ్, ఏప్రిల్ 19: గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ట్రైనీ కలెక్టర్ మనోజ్ అధికారులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని సింగీతం, నాగన్‌పల్లి గ్రామాల్లో తాగునీరు, అమ్మ ఆదర్శ పాఠశాలలు, మనఊరు మనబడి పనులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న పనులను అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. పనులన్నీ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో ఎంఎం.షరీఫ్, ఎంపీవో అంజలీదేవి, ఏఈ తహా, ఐకేపీ అధికారి నర్సింహులు, ఈజీఎస్ అధికారి రమేశ్ ఉన్నారు.

నాగన్‌పల్లి గ్రామంలో సమస్యలను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ మనోజ్

ఇండ్ల స్థలాల కోసం భూనిర్వాసితుల ఆందోళన

కూలిన ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న భూ నిర్వాసితులు

పుల్కల్, ఏప్రిల్ 19: ముంపు గ్రామమైన పెద్దారెడ్డిపేటకు ఇప్పటివరకు ఇండ్ల స్థలాలు ఇవ్వడం లేదని భూనిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం పెద్దారెడ్డిపేట గ్రామానికి చెందిన 35 కుటుంబాల భూనిర్వాసితులు ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారు. ముందుగా గ్రామంలోని పురాతన ఇండ్లను విలేకరులకు చూపించారు. అనంతరం వారు మాట్లాడుతూ 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో మొదటి విడుతలో భాగంగా 250 మందికి ఇండ్ల పట్టాలు పంపిణీ చేశారు. రెండో విడుతలో మరో 250 మందికి ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. దీంతో నష్టపరిహారం కింద డబ్బులు చెల్లించినప్పటికీ ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడంతో కూలిపోయిన పురాతన ఇండ్లల్లోనే నివసిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి పూట ఇండ్లల్లోకి క్రిమికీటకాలు వస్తున్నాయన్నారు. అడవి జంతువులు కూడా చొరబడి గాయపరుస్తున్నాయని చెప్పారు. 35 కుటుంబాల నిర్వాసితుల కోసం గతంలో 3 ఎకరాల పట్టా భూమిని సైతం కొనుగోలు చేశారన్నారు. దానిని పంపిణీ చేస్తే అందరికీ సరిపోతుందని చెప్పారు. లేదంటే కొందరు వ్యక్తులు దాన్ని కబ్జా చేసే అవకాశం ఉందన్నారు. ఆ భూమిని పంపిణీ చేసి ఇబ్బందులు తొలిగించాలన్నారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ మా బాధలు మాత్రం తీరడం లేదన్నారు. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మా బాధలను గుర్తించి న్యాయం చేయాలని భూనిర్వాసితులు కోరారు.

ఘనంగా రథోత్సవం

జగదేవ్‌పూర్ ఏప్రిల్19: మండలంలోని రంగనాయకస్వామి ఆలయం వద్ద రథోత్సవం అశేష భక్తుల నడుమ వేడుకగా నిర్వహించారు. శ్రీరామ నవమి సీతారాముల కల్యాణంతో ప్రారంభమైన ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. స్వామివారి రథాన్ని అందంగా అలంకరించి వందలాది మంది భక్తులు పాల్గొనగా గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేపట్టారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బుద్దనాగరాజు, నర్సింహులు, మారుతీ వెంకట్‌రెడ్డి, కనకయ్య, శ్రీను, రవి, బాల్‌నర్సయ్య పాల్గొన్నారు.

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉత్సవ మూర్తులకు కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం

బెజ్జంకి, ఏప్రిల్ 19: మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాల్లో భాగంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం శుక్రవారం సాయంత్రం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వివిధ రకాల పూలతో సుందరంగా తీర్చిదిద్దిన మండపంలో ఉత్సవమూర్తుల కల్యాణాన్ని వేదపండితులు ఘనంగా జరిపించారు. ఈ కార్యక్రమానికి మండలం నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. దాచారంలో సీతామురాముల జాతర ఉత్సవాల సందర్భంగా శకటోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో విశ్వనాథశర్మ, భక్తులు పాల్గొన్నారు.

హుస్సేల్లి చెక్‌పోస్టు వద్ద నగదును పట్టుకున్న పోలీసులు

నగదు పట్టివేత

న్యాల్‌కల్, ఏప్రిల్ 19: మండలంలోని హుస్సేల్లి శివారులోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద శుక్రవారం రూ.1.08లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. హద్నూర్ ఎస్ఐ రామానాయుడు కథనం ప్రకారం..బీదర్, జహీరాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. కర్ణాటకలోని బీదర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న వాహనంలో రూ. 1.08 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. తనిఖీల్లో కేంద్ర పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

వర్షంతో ఊరట

న్యాల్‌కల్, ఏప్రిల్ 19: ఎండల తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలకు కురిసిన వర్షంతో ఉపశమనం లభించింది. శుక్రవారం సాయంత్రం మండలంలోని రేజింతల్, ఖలీల్‌పూర్, మిర్జాపూర్(బి), న్యాల్‌కల్, హద్నూర్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన తెలికపాటి వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లాబడి ప్రజలకు ఉపశమనం లభించింది.

బీజేపీతోనే దేశాభివృద్ధి

నాగల్‌గిద్ద, ఏప్రిల్ 19: బీజేపీతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని మాజీ ఎమ్మెల్యే విజయ్‌పాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మేగ్యానాయక్ తండాకు చెందిన వందమంది బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ బీజేపీతోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రాజురాథోడ్, మండలాధ్యక్షుడు రాజశేఖర్ తదితర నాయకులు ఉన్నారు.

చింతల్‌ఘాట్‌లో బీరప్ప జాతర

ఆలయావరణలో ఏర్పాటు చేసిన అగ్నిగుండం

కోహీర్, ఏప్రిల్19: మండలంలోని చింతల్‌ఘాట్ గ్రామంలో శుక్రవారం బీరప్ప స్వామి ఆలయ జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా బోనాల ఊరేగింపు నిర్వహించి స్వామి వారికి సమర్పించారు. గ్రామంలో రెండేండ్లకు ఒకసారి నిర్వహించే బీరప్ప జాతరలలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయావరణలో అగ్నిగుండం ఏర్పాటు చేశారు. అందులో నడుస్తూ భక్తిని ప్రదర్శించారు. మూడు రోజుల పాటు జాతరను నిర్వహిస్తామని నిర్వాహకులు కోరారు.

నేడు జిన్నారం నుంచి ర్యాలీ

జిన్నారం, ఏప్రిల్ 19 : మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు శనివారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. జిన్నారంలోని పార్టీ కార్యాలయం నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మెదక్‌కు భారీ ర్యాలీగా వెళ్తారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వడ్డే కృష్ణ శుక్రవారం తెలిపారు. ఉదయం ఏడు గంటలకు పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభం అవుతుందన్నారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయానికి ఏడు గంటలలోగా చేరుకోవాలని ఆయన సూచించారు.